క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సహజం



జవహర్‌లాల్‌ను సన్మానిస్తున్న అధికారులు

నార్నూర్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. నార్నూర్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన జవహర్ లాల్‌ను సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. ఎంపీడీవో గంగాసింగ్, ఎంపీవో సాయి ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో సురేందర్ రాథోడ్‌లు సత్కరించారు. నిబద్ధతతో, నిజాయతీగా పని చేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది స్వర్ణలత, వాణి, మౌనిక, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఫీజుల దోపిడీని నియంత్రించాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాఠశాలల్లో, కొన్ని బుక్‌స్టాల్స్‌తో కుమ్మక్కై అధిక ధరలకు పాఠ్య పుస్తకాలను అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అవసరమైన స్కూల్ యూనిఫాం, బూట్లు, టై, బెల్ట్ ఇతర స్టేషనరీని రూ.10వేలకు మించిన ధరలతో అమ్ముతున్నారని ఆరోపించారు. పేరెంట్స్ కమిటీతో చర్చించకుండానే ప్రతీ సంవత్సరం ఫీజులను పెంచుతున్నారని మండిపడ్డారు. సంఘం ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్, లకన్, మేకల జితేందర్, ఎండీ రియాజ్, సతీష్, రాజు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: కోర్టులో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు సోమవారం ప్రారంభించారు. జిల్లా అదనపు జడ్జి శివరాంప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి కుమార్ వివేక్, ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

రోడ్డంతా బురదమయం



బురదమయంగా రోడ్డు

- దశాబ్దాలు గడిచినా నోచుకోని రోడ్డు నిర్మాణం
- అత్యవసర పరిస్థితుల్లో తప్పని తిప్పలు

సాత్నాల: దశాబ్దాలు గడుస్తున్నా.. ఆ రెండు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా రోడ్డు నిర్మాణం చేపట్టక అత్యవసర సమయాల్లో ప్రజలకు తీవ్ర ప్రాణసంకటంగా మారుతోంది.

చినుకు పడితే చిత్తడే..

జైనథ్ మండలం నుంచి కొత్తగా ఏర్పడిన సాత్నాల మండలంలోని పార్డి(కె), పార్డి(బి) గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. మూడు కిలోమీటర్ల పాటు మట్టి రోడ్డే పెద్ద దిక్కుగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా.. రోడ్డు చిత్తడిగా మారుతుంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి. గతంలో జైనథ్ మండల కేంద్రానికి కెనాల్ మేడిగూడ మార్గం గుండా వెళ్లాల్సి రావడంతో అదనంగా 12 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



మా గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో సమీప గ్రామాలకు సైతం వెళ్లలేకపోతున్నాం. ఎన్నో సార్లు వాహనాలపై నుంచి పడి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

– దొడ్డ అశోక్, పార్డి, గ్రామస్తుడు

బస్సు కూడా రావట్లేదు



సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో సొంత వాహనం లేదంటే ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. దశాబ్దాలుగా రోడ్డు నిర్మాణం జరుగకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి సైతం కుంటుపడుతోంది.

– పోతరాజు గంభీర్, పార్డి, గ్రామస్తుడు

పేదల కోసమే ప్రజా ప్రభుత్వం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్ రూరల్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణ పనులతో పాటు లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని గంగన్నపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నాణ్యమైన ప్రమాణాలతో ఇళ్లను నిర్మించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు నడిపించాలి

ఉట్నూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సులను అన్ని రూట్లలో నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. సోమవారం ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో మేనేజర్, ఉట్నూర్ డిపో ఇన్‌చార్జి డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి, సిబ్బంది సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ను మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఆర్టీసీ బస్సులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

జీవో 49ని రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాడోబా–అందేరి రిజర్వ్ ఫారెస్ట్‌ను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌తో కలుపుతూ కుమరం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరిధిలో 334 గ్రామాలను గజిట్‌లో పేర్కొంటూ తీసుకొచ్చిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉందని, ఇక్కడ గ్రామసభ, పెసా లాంటి గిరిజన చట్టాలను అమలు చేయకుండా ఎలాంటి సభలు నిర్వహించకుండా, ప్రజాభిప్రాయాలు తీసుకోకుండా జీవోను అమలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం తనుష్, ఉయిక విష్ణు, వెట్టి గణేష్, కొట్నాక్ చందు, మెస్రం మారుతి, వసంత్, అశోక్ పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన ఉండాలి



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న డీఈవో

ఇచ్చోడ: ప్రతీ విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన కలిగి ఉండాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ తరగతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ జెడ్పీ పాఠశాల పీఎం శ్రీకింద ఎంపిక కావడంతో ఆ నిధులతో కంప్యూటర్ తరగతిని ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌జోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాలలో 147 మంది ఉన్నట్లు, ఈ ఏడాది 50 మంది విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండి పోతుందన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

వనమహోత్సవానికి సిద్ధంగా ఉండాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: వన మహోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇస్లాంనగర్‌లో నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ప్రతీ గ్రామంలో హరిత హారం కింద మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణ, రోడ్ల వెంట, ప్రభుత్వ స్థలాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి చేరుకున్న ఆమెకు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. మున్సిపాలిటీలోని విభాగాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను ఆమెకు వివరించారు. టీపీఎస్ నవీన్ కుమార్, ఆర్‌వో కళ్యాణ్, మేనేజర్ స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు తిత్రే గోవింద్ సోదరుడు తిత్రే జైసింగ్ ఇటీవల బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి జైసింగ్‌ను పరామర్శించారు.

నాణ్యమైన విద్యానందించాలి

ఉట్నూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించాలని ఎంఈవో ఆశన్న ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఎంపీయూపీఎస్ తాండ్ర, బాబాపూర్ పాఠశాలను సందర్శించారు. బోధనలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గురుకులల్లో సీట్లు పెంచాలి

ఉట్నూర్ రూరల్: ఐటీడీఏ పరిధిలోని గురుకులల్లో అడ్మిషన్ సీట్లు పెంచాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ జాదవ్ సుమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ పీవో క్యాంపు ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. సీట్ల పెంపుతో పాటు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

బోథ్: మోసపూరిత ఫోన్ కాల్స్, వాట్సాప్ గ్రూపుల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయని అటువంటి ఫోన్‌కాల్స్ కు సమాధానం ఇవ్వొద్దని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని సాకెర గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 17 శాఖల అధికారులు సమస్యలు ఉన్న వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కలెక్టర్ వద్దకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలి

బోథ్: తమకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేతనాలు అందలేదని, ఈ విషయమై జిల్లా కలెక్టర్ రాజార్షి షా వద్దకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని బోథ్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కూడా వినతిపత్రం ఇచ్చారు.

మరదలుపై బావ దాడి

సాత్నాల: వ్యవసాయ భూమి తన పేరుపై పట్టా చేయించాలని అడిగినందుకు తనపై దేవన్న దాడి చేశారని కొండా సంగీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన కొండా కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. వీరందరికీ కలిపి పది ఎకరాల పొలం ఉంది. సంగీత భర్త 16 సంవత్సరాల క్రితం ఊరు వదిలి వెళ్లిపోయారు. అతని ఆచూకీ ఇప్పటి వరకు తెలియదు. తన వాటా భూమి తన పేరు మీద పట్టా చేయిస్తేనే పొలం పనులు సాగనిస్తానని సంగీత పొలం పనులకు అడ్డు రావడంతో బావ కొండా దేవన్న ఆమెపై దాడి చేశాడు. సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సన్మానం

తలమడుగు: ఇటీవల విడుదలైన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించిన నీలగిరి సాయిమిత్రను సోమవారం రుయ్యాడి గ్రామంలో మాజీ డై యిరీ చైర్మన్ లోక భూమారెడ్డి శాలువాతో సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సహకార సంఘ సీఈవో శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

బంద్ జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలనే డిమాండ్లతో ఈనెల 2, 3, 4 తేదీల్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించే డిగ్రీ, ఇంజనీరింగ్, కళాశాలల 72 గంటల బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలను మూసివేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే ప్రభుత్వ కుట్రను వ్యతిరేకించాలన్నారు.

వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ జీఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జీఆర్ చౌహాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులు, వినియోగదారులు సొంతగా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని సూచించారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకవద్దన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించాలని కోరారు.

వానాకాలం జరభద్రం

- విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు
- సొంతగా విద్యుత్ మరమ్మతులు చేయొద్దు



విద్యుత్ సబ్‌స్టేషన్

తలమడుగు: అసలే వర్షాకాలం ఇంటా బయట నిత్యం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. గాలివానకు స్తంభాలు పడిపోయి, తీగలు తెగిపడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. రైతులు, ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వాటి భారీ నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. వర్షంతో పాటు గాలి వీసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలున్న చోట వ్యవసాయ పనులు చేయవద్దు. విద్యుత్ తీగలు కిందికి వేలాడితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

విద్యుత్ మోటర్లు బిగించే క్రమంలో..

పంటలు సాగు చేసే ప్రతీ రైతు వేసవిలో మోటార్లలను తీసివేసి వర్షాలు పడే సమయంలో విద్యుత్ మోటార్లు అమర్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులే మరమ్మతులు చేస్తుంటారు. దీంతో మోటార్లు కాలిపోయే అవకాశం ఉంది. కావున రైతులు సొంతగా మరమ్మతులు చేసుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

అధికారులను సంప్రదించాలి

రైతులు వర్షాకాలంలో సొంతగా మరమ్మతులు చేయకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలి. లేదంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రైతులు చిన్నపాటి పొరపాటు కూడా చేయవద్దు.

– శ్రీనివాస్, విద్యుత్ ఏఈ, తలమడుగు

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సిరికొండకు చెందిన బొడ్డు ప్రేమలకు మంజూరైన రూ.17వేలు సొంపల్లి గ్రామానికి చెందిన యమునజీకు రూ.25,500, బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన బొంగురాల సంగీతకు రూ.17వేల విలువ గల చెక్కు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బోథ్: పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు సాయం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం బోథ్, సొనాల మండలాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీ ముబారక్ చెక్కులు ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ స్వామి, నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని ఖండేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆడే పరుశురాం తెర్వి కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. పరుశురాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శామ్యుల్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాముల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతో తనిఖీ చేసే చర్యలను మానుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్ డీఏలు చెల్లించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, దిలీప్, వృకోధర్, నగేందర్, సాయికాంత్, సంతోష్, నగేశ్, శుద్ధోధన్ పాల్గొ

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



లింగన్నను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ విరమణ తర్వాత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బేల ఏఎస్సైగా విధులు నిర్వహించిన ఉద్యోగ విరమణ పొందిన లింగన్నను సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. నలభై ఏళ్ల పాటు పోలీసు సేవలు అందించారని కొనియాడారు. ఉన్నతాధికారుల మన్ననలు పొందుతూ అవార్డులు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జైనథ్ సీఐ సాయినాథ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పీసీఆర్ ఎస్సై కుట్టే శివాజీ కుటుంబానికి 1989 బ్యాచ్ మిత్రులు ఆర్థిక సాయం చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా ఆయన కుటుంబసభ్యులకు రూ.50వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సయ్యద్ తాజొద్దీన్, రాఘవేందర్, ఈశ్వర్ సింగ్, తుకారాం, సుభాష్, జహీర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

బోథ్: నూతనంగా ఏర్పడిన సొనాల మండలంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన నాయకుడు గాజుల పోతన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కా ర్యాలయంలో కలిసి వినతిపత్రం అందించా రు. సొనాల పరిధిలో నేరాలు ఎక్కువగా నమో దు కావడం, మహారాష్ట్ర సరిహద్దు ఉండటంతో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: దస్నాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ జీఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ లైన్ మరమ్మతు పనులు చేపట్టనుండడంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దస్నాపూర్, ఆదర్శనగర్, ఖోజాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
BUSINESS OFFER
మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214 [H-763418]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899